## ఒంటిమిట్టలో ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : రెండో అయోధ్యగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి ఉత్తర ద్వారం గుండా సతీసమేత దర్శనమిస్తున్న లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి దర్శనం కోసం భక్తులు వేకువజామునుండే బారులు తీరారు జై శ్రీరామ నినాదాలతో కోదండ రామాలయం మారు మోగింది పుష్పాలతో అందంగాలంకరించబడిన సీతా రామ లక్ష్మణ ఉత్సవమూర్తులు గరుడ మంత్రునిపై ఆసీనులై ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు అనంతరం పురవీధులలో ఊరేగుతూ గ్రామ ప్రజలకు దర్శనమిచ్చారు భక్తులు స్వామి వారికి కాయ కర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు స్వామి వారి ఊరేగింపు వెంట తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఏర్పాటుచేసిన కోలాటాలు భజనలు భక్తులను అలరించాయి దేవాలయంలో

-5లో

# విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

శనివారం 11, జనవరి 2025 | 8 పేజీలు


# ఇంటి స్థలాలు, సాగుభూమి పంచేవరకు పోరాటం

- ఎస్టేట్‌ల పేరుతో ప్రభుత్వ భూముల ఆక్రమణ - చోద్యం చూస్తున్న అధికారులు
- పేదల భూములు లాక్కునేందుకే 22 ఏ చట్ట సవరణ- స్పందించకపోతే కలెక్టర్ కార్యాలయాల దిగ్బంధనం తప్పదు

కడప తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూమిని విముక్తి చేసి అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలము ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు రెండు ఎకరాల సాగు భూమి పంపిణీ చేసే వరకు పోరాడుతామని సిపిఐ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇండ్లు ఇస్తాం, ఇంటి స్థలం ఇస్తాం, రేషన్ కార్డుతో పాటు మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, 24 గంటలు త్రాగునీరు అందిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలతో ఓట్లు దండుకొని అధికారంలోకి రాగానే ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి ప్రజలు ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు నెడుతున్నారని వారు ఆరోపించారు. దశాబ్దాల తరబడి పేదలు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం కోసం అధికారులు అధికార పార్టీ నేతల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న ఫలితం దక్కడం లేదన్నారు. గత ఐదు సంవత్సరాల జగన్ పాలనలో జగనన్న కాలనీల పేరుతో కేవలం ఒక సెంటు జాగా ఇచ్చి తక్షణం ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోకపోతే రద్దు చేస్తామన్న షరతులతో భయపడి ప్రజలు ఐదు రూపాయలు పది రూపాయలు వడ్డీలకు అప్పు తెచ్చి కట్టి చేసిన అప్పు తీర్చుకోలేక తాకట్టు పెట్టే పరిస్థితికి వచ్చారన్నారు. నివాసయోగ్యం కానీ ప్రాంతాలలో ఇవ్వడం వల్ల చాలామంది ప్రజలు ఇంటి స్థలాలు తీసుకోవడానికి నిర్మాణం చేపట్టడానికి నిరాకరించారన్నారు. చంద్రబాబు తాను అధికారంలోకి రాగానే గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి 4లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి చేయిస్తానని ప్రకటించారన్నారు, తన ఎన్నికల వాగ్దానాన్ని తక్షణము అమలు చేయాలని ఇంటి నిర్మాణ వ్యయాన్ని ఐదు లక్షలకు పెంచి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. భూమి లేని నిరుపేదలకు రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలన్నారు. పేదలకు ఇంటి స్థలం ఇవ్వడానికి నిరాకరిస్తున్న అధికారులు కళ్ళముందే విలువైన ప్రభుత్వ వంక వాగో చెరువు రాస్తా, అసైన్డ్, దేవాదాయ, ఈనామ్ , వక్ఫ్, అటవీ భూములు చివరకు స్మశానాలను కూడా వదలకుండా ఆక్రమించి అమ్ముకునే డీకేటి మాఫియా కొమ్ము కాస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన రిసర్వే 22 ఏ చట్ట సవరణ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల ప్రభుత్వ, ప్రైవేటు భూములకు రక్షణ ఉండదని గగ్గోలు పెట్టి తాను అధికారంలోకి రాగానే మూడు చట్టాలను రద్దు చేస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఆరు మాసాల పాలనలో మొదటి రెండు చట్టాలను పునరుద్ధరించి విలువైన ప్రభుత్వ భూములు పేదల భూములు అడ్డగోలుగా ఆక్రమించుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేశారన్నారు.జిల్లాలో ఎక్కడ చూసినా అధికార పార్టీ నేతల అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా, ఎమ్మెల్యే ఇంటి సమీపంలో భూ ఆక్రమణలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని వారు ప్రశ్నించారు. గతంలో పోరాడి సాధించుకున్న భూ సంస్కరణ చట్టాన్ని అధికార పార్టీ నేతలు చుట్టంగా మార్చుకొని వందల ఎకరాల భూములు ఆక్రమించుకొని చుట్టూ సోలార్ ఫెన్సింగ్, మధ్యలో విలాసవంతమైన ఫామ్ హౌస్ సంస్కృతిని పెంచి పోషిస్తూ వారి కొమ్ము కాస్తున్న రెవెన్యూ పోలీస్ యంత్రాంగం విధి లేక పేదవాడు జానెడు జాగాలో గుడిసె వేసుకుంటే ఆగ మేఘాల మీద గుడిసె పీకి పెట్టి కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించి అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు సాగుభూమి పంచాలని సిపిఐ చేపట్టిన దశల వారి

-5లో

## ముత్తూట్ ఫైనాన్స్‌లో ఘరానా మోసం

### ఖాతాదారుడు ప్రమేయం లేకుండా బంగారంపై సిబ్బంది రుణాలు తీసుకున్న వైనం

విశాలాంధ్ర -రాజంపేట: కూలీ నాలి చేసి రూపాయి రూపాయి కూడ బెట్టుకున్నారు. ఆ డబ్బులతో కొద్ది పాటి బంగారాన్ని తయారు చేయిం చుకున్నారు. కుటుంబ అవసరాల కోసం గోల్డ్ తాకట్టు సంస్థలో పెట్టు కుని డబ్బు తెచ్చుకున్నారు. అయితే, ఇదే అదనుగా చేసుకున్న కొందరు సిబ్బంది ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారం వేరే ఆధార్ కార్డుదారుల పేరుతో రిజిస్టర్ చేసి అధిక మొత్తంలో డబ్బులు నొక్కేశారు. ఈ ఘటన రైల్వే కోడూరు పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో వెలుగుచూసింది. శుక్రవారం బాధితుడు రాజంపేటలో విలేకరులతో మాట్లాడుతూ ముత్తూట్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ 2023 వ సంవత్సరం ఆగస్టు 18వ తేదిన 11గ్రాముల బంగారు చైన్ 33 వేల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు.అయితే సిబ్బంది గడువు ముగుస్తుంది మీ రుణం పై వడ్డీతో సహా 54 వేల రూపాయలు చెల్లించాలని సిబ్బంది చెప్పడంతో కంగుతిన్న బాధితుడు బ్రాంచ్ కి వెళ్లి సంప్రదించగా తన పేరు మీద సిబ్బంది ఎవరో తన ప్రమేయం లేకుండా బంగారం ని విడుదల చేసుకొని , దాని పై అదనంగా డబ్బులు తీసు న్నారు అని తెలుసుకున్న బాధితుడు సిబ్బందిని నిలదీయాగ " మీరే డబ్బులు తీసుకు న్నారు అని మీరే కట్టాలి ఎవరికి అయిన చెప్పుకోండి " అని దురుసుగా ప్రవర్తించడంతో బాధితుడు మీడియా నీ సంప్రదించి తనకు న్యాయం చేయాలని కోరారు.

## 20 సూత్రాల కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలి

విశాలాంధ్ర:రాయచోటి: అన్నమయ్య జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమాలను అత్యంత పటిష్టంగా నిర్వహించి లక్ష్యసాధనలో వందశాతం ఫలితాలకు కృషి చేయాలని 20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాకు విచ్చేసిన 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ ను స్థానిక కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జేసీ ఆదర్శ రాజేంద్రన్ లు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ నందలి వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమం అమలుపై వివిధ శాఖల అధికారులతో చైర్మన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా సమీక్షలో భాగంగా కేంద్ర ప్రాయోజిత పథకాలు వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలలో పురోగతి మీద సమీక్ష నిర్వహించటానికి రావడం జరిగింది. కలెక్టరేట్ నందు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షించడం జరిగింది. ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, అమృత్ పథకం 1,2, పీఎం ఆవాస్ యోజన, టీడ్కో గృహాలు, పీఎం సూర్ ఘర్ పథకం, పీఎం కుసుమ్ వ్యవసాయానికి విద్యుత్ అందించే పథకం, అలాగే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న యూరియా సబ్సిడీ అలాగే జాతీయ ఆహార భద్రత పథకం, గరీబ్ కళ్యాణ అన్న యోజన తదితర అంశాలలో సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో దాదాపు రెండు లక్షల పైబడిన వారికి పనులు కల్పించడం జరిగింది. అందులో 8588 కుటుంబాలు 100 పని దినాలు పూర్తి చేసుకున్నాయి. మెటీరియల్ కాంపోనెంట్ కు సంబంధించి ఏడాది రూ. 132 కోట్లు అంచనా కాగా, ఇప్పటివరకు రూ.102 కోట్లు ఖర్చు చేశారు. రాబోయే రెండు నెలల కాలంలో సాధ్యమైనంత ఎక్కువ పనులు కల్పించి వందశాతం లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర-రాయచోటి: రాయచోటి మండలం, గరుగుపల్లి, పెమ్మాడపల్లి గ్రామం, ప్రాథమికోన్నత పాఠశాలలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి నీటి సమస్య పరిష్కారానికి నూతన బోరును ప్రారంభించారు. ఈ సంద ర్భంగా టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పెమ్మాడపల్లి గ్రామం ప్రాథమిక ఉన్నత పాఠశాలను గతంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సందర్శించడం జరిగింది. అప్పట్లో పాఠశాల ఉపాధ్యాయులు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నీటి సమస్య అధికంగా ఉందని మంత్రి దృష్టికి తెలుపగా మంత్రి త్వరలో నూతన బోరు వేసి నీటి సమస్య పరిష్కరిస్తామని వారికి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో నేడు ప్రాథమికోన్నత పాఠశాలలో నూతన బోరు వేసి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సంద ర్భంగా పెమ్మాడపల్లి గ్రామ ప్రజలు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డికి గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్ర మాలు చేసి నూతన బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు పేదలకు దక్కేవరకు పోరాటం: సీపీఐ

విశాలాంధ్ర-వల్లూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఎన్నికల ముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రకటిం చిన విధంగా ప్రతి పేద కుటుంబానికి రెండు ఎకరాల సాగు భూమితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అర్హులకు మూడు సెంట్లు ఇంటి స్థలం పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం హామీని అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణుగోపాల్ పి.చంద్రశేఖర్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు స్థానిక వల్లూరు తాసిల్దార్ కార్యాలయం వద్ద అర్జీదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, మండల నాయకులు వెంకటలక్ష్మి, రవి, దావీదు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో వారం రోజుల పాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ముఖ్య అతిథిగా పులివెందుల అరటి పరిశోధనా కేంద్రం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్. వి.ఎన్.పి. శివరామ కృష్ణ విచ్చేశారు. విద్యా వాలంటీర్లు సొంత ఎదుగుదలతో సమాజానికి కూడా సేవచేయాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రత్యేక శిభిర కార్యక్రమాలు బాగా చేసారని, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు తమను ఎంతో ఆప్యాయంగా రోజు పలకరించేవారని సభలో తమ అభిప్రాయాలు తెలిపారు. ముగింపు రోజు ఉదయం గ్రామం నందు పరిసరాల పరిశుభ్రతకు సంబంధించి, గ్రామ పరిధిలో క్రిమి సంహారక చర్యల్లో భాగంగా బ్లీచింగ్ పౌడిని వేసి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో, మూడు రోడ్ల కూడలి యందు "సిమెంట్ చెత్తకుండీలు ఏర్పాటు" చేసి, ఆ చెత్తకుండీలకు నాల్గొవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు తెల్ల పెయింట్ వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. జయమ్మ,డాక్టర్ నివేదిత, అధ్యాపకులు ఇంజినీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకిర్ బాషా, ఎన్.వి. సుబ్బారెడ్డి, నాల్గొవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.

# పేదలకు ఇల్లు, ఇళ్ల స్థలాలు, సాగుభూమి ఇవ్వాలి

విశాలాంధ్ర-మైదుకూరు : మైదుకూరులో పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని అలాగే బంజరు భూములు మంజూరు చేయాలని స్థానిక అంబేద్కర్ కూడలి నుండి మార్కెట్ కూడలి వరకు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్వో కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్. నాగ సుబ్బారెడ్డి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పి.శ్రీరాములు మాట్లాడుతూ గత ప్రభుత్వం పంపిణీ చేసిన ఇండ్ల స్థలాలు ఇండ్లు శిథిలావస్థకు చేరాయని దీనివల్ల వందల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి నష్టం వచ్చిందని వారన్నారు. అలాగే కాలనీలలో పనులు ఎక్కడికి అక్కడ కాంట్రాక్టర్లు నిలిపి వేశారని లబ్ధిదారులు పలుమార్లు అధికారులకు తెలియజేసిన నిర్మాణం పనులు పూర్తి కాలేదని వారన్నారు. మండలం లోని నంద్యాలం పేట విపురాపురం రేకలకుంట ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఉన్నాయని వీటిని రాజకీయ నాయకుల అండతో వందల ఎకరాలు ఆక్రమించుకుంటున్నారని ఆక్రమణకు గురైన భూములు అన్నిటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని అలాగే ప్రతి పేద కుటుంబానికి రెండు ఎకరాల ప్రభుత్వం భూమి మంజూరు చేయాలని అన్నారు. పై డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ నాయకులు శీను, ఎస్ షావలి, బి. పీరయ్య, సుబ్బరాయుడు, లక్ష్మయ్య, బాలసుబ్బయ్య, ఓబులేసు, జయరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా వైకుంఠ ఏకాదశి

### అలరించిన కోలాటం..గోవిందుడి నామస్మరణతో పూజలు

### ఆలయాలకు పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎర్రగుంట్ల ప్రాంతంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తుల గోవింద నామస్మరణతో మారుమ్రోగాయి. స్థానిక సుందరయ్య నగర్‌లోని పద్మావతి పురంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం తెల్లవారుజామున 12.30 గంటల నుండి ప్రత్యేక అభిషేకాలతో శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుండి భక్తులకు ఉత్తరద్వార ప్రదేశం కల్పించారు. వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తరద్వారం గుండా స్వామి వారిని దర్శించుకుంటే సకల పాపాలు హరించబడి కోర్కెలు నెరవేరడంతో పాటు వైకుంఠ భాగ్యం లభి స్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం, ఈ కారణంగానే శుక్రవారం తెల్లవారుజాము నుండే భక్తులు వైష్ణవ ఆలయాలకు పోటెత్తారు. పూజల నిమిత్తం బెంగుళూరు నుండి ప్రత్యేకంగా పుష్పాదులను తెప్పించడం విశేషం.

**అలరించిన కోలాటం:** స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రద ర్శించిన కోలాటం భక్తు లను విశేషంగా అలరించింది. వీరి ప్రదర్శనలు భక్తులనుఓలలాడించాయి. బృందంలోని మహిళలు కోలాటంలోని గేయాలకు అనుగుణంగా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలను తిలకించేందుకు మహిళలు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా కోలాటం బృంద సభ్యులకు భక్తుల నుండి ప్రశంసలు లభించాయి. పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుండి భక్తుల రవాణా సౌకర్యార్థం ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. కాగా మండల పరిధిలోని చిలమకూరు గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కూడా వైకుంఠ ఏకాదశి ఘనంగా జరిగింది. వైకోడూరు గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వా మి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

# భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

విశాలాంధ్ర -రైల్వేకోడూరు : వైకుంఠ ఏకాదశి సందర్భంగా శు క్రవారం నియోజక వర్గంలోని ఆల యాలు భక్తులతో కిటకిటలాడాయి. కె బుడుగుంటపల్లి గ్రామం వద్ద వెలసిన శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త దేసూరి సుబ్రమణ్యం,మహేశ్వరి దంపతుల అద్వర్యంలో వైకుంఠ ఏకాదశి పండుగ వైభవంగా జరిగింది. అన్నదాత దంపతులు బత్తల ఈశ్వరయ్య,భాగ్యమ్మ లకు ఆలయం తరపున విలువైన శాలువా కప్పి పూలమాలవేసి ఘనంగా సన్మానించారు.వైకుంఠ ఏకాదశి పండుగ రోజున ఆలయ సేవకులు యామల సిద్దేశ్వర ఆహ్వానం మేరకు శుక్రవారం మాజీ ఎంపిటిసి బత్తిన ఆనంద్ యాదవ్, సయ్యద్ లాల్ భాష వెళ్లి భక్తిశ్రద్ధలతో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం యామల సిద్దేశ్వర ఆనంద్ యాదవ్ కు,బి రామచంద్ర కు పూలమాలవేసి అభి నందిం చారు.తీర్థ ప్రసా దాలు ఉచి తంగా అంద జేశారు.భక్తుల కోసం టోకెన్ పద్ధతిని అవలం బించారు.చుట్టు ప్రక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి తోచిన మేర స్వామికి కానులు సమర్పించి దర్శించు కున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.తరలి వచ్చిన భక్తులను అదుపు చేయడం సాధ్యం కాలేదు. ఆలయాన్ని రంగురంగుల ముగ్గులతో,పూలతో, విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు.ఆలయం వద్ద కె బుడుగుంటపల్లి గ్రామ యువకులు విలువైన సేవలు అందించారు.ఈ కార్యక్రమంలో మహిళలు, ఆలయ సేవకులు ఎవి రత్నం,గ్రామ పెద్దలు,మరియు టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి కొమరాల రాజశేఖర్, కోడూరు శివకుమార్,జి మణిదీప్తికుమార్ పాల్గొన్నారు.

## భక్తుల ప్రాణాలతో చెలగాటమా!

విశాలాంధ్ర-రాయచోటి: తిరుమల భక్తుల ప్రాణాలతో టీటీడీ పాలకవర్గం చెలగాట మాడు తుందని వైయస్సార్సీ పి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి ఆరోపిం చారు. రాయచోటి పట్టణం వైఎస్ఆర్సిపి కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ తిరుమలను రాజకీయ కేంద్రంగా మార్చి విఐపిల సేవలో అధికార యంత్రాంగం తరిస్తుందని విమర్శించారు. తొక్కిసలాటలో భక్తుల మరణాలు ప్రభుత్వ హత్యలుగా భావించాల్సి వస్తుందని అన్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్గ్రేషియా చెల్లించి వారి కుటుంబాలు ఆదుకోవాలని గాయపడిన వారిక ఆర్థిక సహాయం అంద జేయాలని రమేష్ కుమార్ రెడ్డి కోరారు. చనిపోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు గాయపడ్డ వారికి ప్రభుత్వం ప్రత్యేక వైద్య చికిత్సలు అందించి త్వరగా కోలుకోవాలని రమేష్ కుమార్ రెడ్డి అన్నారు.

## బండలాగుడు పోటీల విజేత చౌటిపల్లి కోడెలు

విశాలాంధ్ర-పులివెందుల: మండల పరిధి లోని ఉలిమెళ్ళ గ్రామంలో శుక్రవారం నిర్వ హించిన బండలాగుడు పోటీల్లో చౌటిపల్లికి చెందిన చంద్ర కోడెద్దులు ప్రథమ బహుమతి ని సాధించాయి.ముక్కోటి ఏకాదశి మహో త్సవం సందర్భంగా పులిమెల్ల గ్రామ సమీ పంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటే శ్వర స్వామి ఆలయ సమీపంలో గ్రామస్తులు నిర్వహించిన బండ లాగుడు పోటీలో పది గాండ్లు పాల్గొన్నాయి. వైఎస్ ఆర్ సీపీ మున్సిపల్ ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి ఎద్దుల పోటీలను ప్రారంభించారు. ఇందులో చౌటిపల్లి గ్రామానికి చెందిన చంద్ర కోడెలు 3524.4 అడుగులు లాగి ప్రథమ బహుమతిని,ఎంవీఎస్ ఆర్ బుల్స్ 3084.5 అడుగులు లాగి ద్వితీయ బహుమతిని, వేంపల్లి గ్రామానికి చెందిన రమణయ్య కోడలు 3004.8 ఆగులు లాగి తృతీయ బహుమతిని , రాజువారిపేటకు చెందిన శ్రీకాంత్ రెడ్డి కోడెలు 2730 అడుగులు లాగి నాలుగవ బహుమతిని ,వరదాయపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు కోడెలు 2688.3 అడుగులు లాగి ఐదవ బహు మతిని పొందాయి.మొదటి బహుమతిని పొందిన చంద్ర కు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరు మీదుగా 50 వేల నగదును గ్రామస్తులు కె గోపాల్ రెడ్డి,గజ్జల వెంకట సుబ్బారెడ్డి, బి జనార్దన్ రెడ్డి, ఏ శ్రీనివాస రెడ్డిలు అందించారు. రెండవ బహుమతి 40 వేలు ,మూడవ బహుమతి 30 వేలు నాల్గవ బహుమతి 20 వేలు,ఐదవ బహుమతి 10 వేలు నగదును గ్రామస్తులు విజేతలకు అందచేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గ్రామస్తులు మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో గ్రామస్తులు, నిర్వాహకులు గోపాల్ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి,సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

విశాలాంధ్ర-రాయచోటి : ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులుగా డి.రాజ శేఖర్, కార్యదర్శిగా జక్కల వెంకటేష్‌లను ఎన్నుకొన్నారు. అన్నమ య్య జిల్లాలోని రాయచోటి కేంద్రంలో సీపీఐ కార్యాలయంలో 9వ తేదీన జరిగిన ప్రథమ జిల్లా ప్రతి నిధు ల సభ లో ఏఐవైఎఫ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకొన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులుగా తులసి (పీలేరు) సహాయ కార్యదర్శులుగా టీ.సుదర్శన్, మాధవ్‌లతో పాటు 15 మంది కౌన్సిల్ సభ్యులతో మొత్తం 21 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ప్రశాంత్, జగ దీశ్, ఓబులే సు, అంజి, శివ, శ్రీను, పెంచలయ్య, సుధాకర్‌లు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలకు రూ.5లక్షలు కేటాయించాలి : సీపీఐ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : అర్హులైన పేదల కు ప్రభుత్వ స్థలాలు కేటా యించి రూ.5 లక్షలు మంజూ రు చేయడం ద్వారా సొంతింటి కల సాకారం అయ్యేలా చూడాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వి.సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతా ల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలం కేటాయించి ఇళ్లు మంజూరు చేయడంతో పాటు వాటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని కోరుతూ మండల తాహసీల్దార్ శోభన్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి నారాయణ, శరత్, ప్రతాప్, గిరి, నిరంజన్, చెంద్రాయుడు, మల్లేష్, కేశవ, ధనరాజ్ పాల్గొన్నారు.

## లింగనిర్ధారణ వ్యతిరేక చట్టంపై అవగాహన

విశాలాంధ్ర-పులివెందుల: సింహాద్రిపురం మండలం కోవరంగుట్ట పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శు క్రవారం డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో లింగనిర్ధారణ వ్యతిరేక చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డెమో రమణమ్మ మాట్లాడుతూ గర్భస్థపూర్వ మరియు పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం గురించి తెలుసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీ హాస్పిటల్ కి వెళ్లి స్కాన్ చేయించుకునేటప్పుడు డాక్టర్లను ఆడ మగ గురించి అడగరాదని అలా అడిగిన ఎడల అడిగినవారికి,చెప్పిన వారికి మొదటిసారి శిక్షకు 10000 రూపాయలు జరిమానా మూడు సంవత్సరములు జైలు ,రెండవసారి చెప్పిన యెడల 50 వేల రూపాయల జరిమానా ఐదు సంవత్సరములు జైలు శిక్ష విధిస్తారన్నా రు. హాస్పిటల్ మూసివేయడం జరుగుతుందని తెలిపారు. ఈ మధ్యకాలంలో ఆడపిల్లల సంఖ్య తగ్గుతున్నందు వలన జిల్లాలోని ప్రోగ్రాం ఆఫీసర్స్, పోలీస్ డిపార్ట్మెంట్, ఐసిడిఎస్ డిపార్ట్మెంటు కలిసి స్కాన్ సెంటర్స్ ను ఇన్స్పెక్షన్ చేస్తున్నారని మరియు డికాయ్ ఆపరేషన్ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రాధా, ఖలీల్ భాషా, ఆశాలు, అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో మహ బూబ్ నగర్లో రత్నం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. సంబరాలలో భాగంగా తెలుగు సంస్కృతి ఉట్టి పడేలా పాఠశాల ఆవరణంలో సంక్రాంతి ముగ్గులను తీర్చిద్దిద్దారు. విద్యార్థులు, ఉపాధ్యాయినులు గొబ్బి పాటలతో నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో సి నాగేశ్వరరావు, డాక్టర్ చిన్న, డాక్టర్ చైతన్యజ్యోతి గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. కరస్పాండెంట్ తలారి రత్నం హెడ్మాస్టర్ వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

# సాంకేతిక సహకారం పారదర్శకంగా సేవలు

## అక్రమాలకు చెల్లు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : సహకార సంఘాలు (పీఏసీఎస్) వ్యవసాయానికి ఊతమిస్తూ.. అన్నదాతకు చేదోడువాదోడుగా నిలుస్తున్నాయి. ఇప్పటి వరకు కాగితాల ద్వారా కార్యకలాపాల నిర్వహణకు పరిమిత మయ్యా యి. అటువంటి సంఘాల రూపు రేఖలు మార్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కంప్యూటరీకరణతో పాటు సభ్యుల ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఇందుకు సంబం ధించి గ్రామ సచివాలయాలకు ఆయా సంఘాల వివరాలు, లావాదేవీలకు సంబం ధించి దస్త్రాలు ఇప్పటికే బదిలీ అయ్యాయి. సహకార సంస్థ, గ్రామ సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. కొన్ని సహకార సంఘాల నిర్వహణ, కార్యకలాపాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని పలు సంఘాలు అక్రమాల ఊబిలో కూరుకు పోయా యి. ఒకరికి తెలియకుండా మరొకరు రుణాలు తీసుకో వడం, డిపాజిట్లను సిబ్బం ది సొంతానికి వినియోగిం చుకోవడం వంటి అక్రమా లు అనేకం చోటుచేసు కున్నట్లు ఫిర్యాదులు ఉన్నా యి. ఈ నేపథ్యంలో అటు వంటి వాటికి ముక్కుతాడు వేసేలా.. లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించే దుకు ఈకేవైసీ ప్రక్రియ ఎంతగానో దోహదపడ నుంది. ఇప్పటి వరకు రుణాలివ్వడం, డిపాజిట్లు సేకరించిన సంఘాల్లో పొదుపు ఖాతాలను ప్రారంభించనున్నారు. ఇకపై సభ్యులు సొంతంగా ఖాతాలు తెరిచి డబ్బు దాచుకొ నేందుకు అవకాశంకల్పించనున్నారు. సాంకేతీకరణ పూర్తి చేసి అన్నింటా పొదుపు ఖాతాలు తెరిస్తే లావాదేవీలు ఘనంగా పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు.

## భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే పండుగ సంక్రాంతి

విశాలాంధ్ర-రాయచోటి: భారతదేశంలో భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ బయ్యా రెడ్డి అన్నారు. రాయచోటి శ్రీ సాయి ఇంజనీ రింగ్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాయచోటి పట్టణ ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బయ్యా రెడ్డి, విశిష్ట అతిథిగా ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షులు పబ్బిశెట్టి సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బయ్యా రెడ్డి మాట్లాడుతూ కళాశాల యాజమాన్యానికి అధ్యాపకులకు, విద్యార్థిని విద్యార్థులకు సంక్రాంతి శు భాకాంక్షలు తెలియజేస్తూ భారతీయ సనాతన సంప్ర దాయాలను గౌరవిస్తూ భావితరాలకు భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే పండుగ పర్వదినాలను కులమతాలకు అతీతంగా జరుపుకొని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాలని సూచించారు. వివిధ పోటీలలో ప్రతిభ కనబరి చిన విద్యార్థిని విద్యార్థులకు జ్ఞాపికలను, బహుమ తులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పబ్బి శెట్టి సురేష్ , శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి , పలుసినీ గీతాల ను ఆలపించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ జోనల్ ఇంచార్జ్ సురేందర్ రెడ్డి, అల్లాబకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

### క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-గాలివీడు : క్రీడలతో యువ త నాయ కత్వ లక్షణాలు అలవర్చు కోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అరవీడు గ్రామం ఎల్లంపల్లిలో ఆయన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములను సమా నంగా స్వీకరించాలన్నారు.

## బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-రామాపురం : మండలంలోని బండపల్లి పంచాయతీ బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఆ కళాశాల యజమాని మన్నూరు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల యజమాన్యానికి అధ్యాపకు లకు విద్యార్థిని విద్యార్థుల కు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ సనాతన భారతీయ సాంప్రదాయాలను గౌరవిస్తూ భావితరాలకు భారతీయ సాంస్కృతిని ప్రతిబించి పండగ పర్వదినాలను కుల మతాలతో అతీతంగా జరుపుకొని భిన్నత్వంలో ఏకత్వాన్ని సూచించారు.ఈ నూతన సంవత్సరములో విద్యార్థులు ఉన్నతమైన ఆశయాలకు శ్రీకారం చుట్టి ఘన విజ యాలను సొంతం చేసు కోవాలని ఆయన అన్నారు. ఉపాధ్యా యులు, విద్యార్థులు భోగి మంటలు వేసి సందడి చేశారు. విద్యార్థులు వేసిన కోలాటం, చెక్కభజన, సాంప్రదా య నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. విద్యార్థులు ఆనందంతో పతంగులు ఎగరవేశారు. పాఠశాలలోని విద్యార్థినిల కు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముందస్తు సంక్రాంతి సంబరాల సందర్భంగా పాఠశాల ఉపా ధ్యాయిని ఉపాధ్యాయు లు, విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయ దుస్తులలో పాఠశాలకు హాజరు కావడం పలువురిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో బిట్స్ కళాశాల యజమాని మన్నూరు భాస్కర్. చెన్నకేశవరెడ్డి రెడ్డి కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి ఘటనపై శ్రీకాంత్ విమర్శలు హాస్యాస్పదం

విశాలాంధ్ర-వేంపల్లి: టిడిపి ఘటనపై దేవా దాయశాఖ మాజీ సలహాదా రు జ్వాలాపురం శ్రీకాంత్ విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కమిటీ ప్రచార అధ్యక్షులు రఘునాథరావు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రసాదరావులు అన్నారు. బుధవారం రాత్రి తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు. చనిపోవడం బాధాకరమే గాని అందుకు ప్రభుత్వంబాధ్యత వహించాలని దేవాదాయ శాఖ మాజీ సలహాదారుడు విమర్శించడం సిగ్గుచేట న్నారు. గతంలో నరసింహ స్వామి దేవాల యంలో రథాన్ని కాల్చినప్పుడు, తిరుమల కల్తీ జరిగినప్పుడు గానీ అప్పటి ప్రభుత్వాన్ని బాధ్యత వహించాలని శ్రీకాంత్ ఎందుకు విమర్శించలేదన్నారు. బాధ్యత లేని ప్రకట నలను బ్రాహ్మణ సంఘ నాయకులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ముందు ఆ నాయకుడి సంఘంలో నుండి తెలుగుదేశం పార్టీలో చేరిననాయకులు కూడా ఖండించాలని కోరారు.

## మిని గోకులం ప్రారంభం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని పుల్లంపేట మండలం దళవాయిపల్లి గ్రామ పరిధిలో శుక్రవారం కడప కుడ డెవలప్మెంట్ అధారిటీ ఛైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి శుక్రవారం మిని గోకులం గోశాలను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మిని గోకులం గోశాలలను చేపట్టిం దన్నారు.పాడిపరిశ్రమను బలోపేతం చేయడా నికి ప్రభుత్వం పట్టుదలతో ముందుకు పోతుందన్నారు.గోవులను కొనుగోలు చేయ దానికి,మిని గోకులం గోశాలల నిర్మాణం కోసం అర్హులైన వారికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ప్రభుత్వం కల్పించే ఇలాంటి అవకాశాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిం చడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముక్కా విశాల్ రెడ్డి, సాయివికాస్ రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సింగమాల మల్లికార్జున రెడ్డి,మహేంధర్ రెడ్డి, కనమనేని సంజీవ్ గాంధీనాయుడు, చవన సుబ్బ రాయుడు నాయుడు,కేశనేని నారాయణ నాయుడు, ముద్దా గంగిరెడ్డి, వెంకటసుబ్బ య్య యాదవ్,టిడిపి యువ నాయకులు చవన అంజి, పోలీసులు అమర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుకు, మంత్రి సవితమ్మకు ధన్యవాదాలు

విశాలాంధ్ర-రాయచోటి: వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవితకు వడ్డెర కులస్తులు ధన్యవాదాలు తెలిపారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని వడ్డెర కులస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీల మనో భావాలను గౌరవిస్తూ, వడ్డే ఓబన్న జయంతిని అధికారి కంగా నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయ డంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్ గారు, వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ దేవల్ల మురళి గారు, పల్నాడు జిల్లా తెలుగు యువత కార్యదర్శి దేవల్ల దుర్గ రావు మరియు వడ్డెర సంఘం మహిళ నాయకురాలు సావిత్రమ్మ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభిషేక్‌రెడ్డి మృతిని ధ్రువీకరించిన వైద్యులు

విశాలాంధ్ర-పులివెందుల: మాజీ సీఎం జగన్ సమీపం బంధువు డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతిని ఎట్టకేలకు వైద్యులు ధ్రువీకరించారు. అనారోగ్యానికి గురైన అభిషేక్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో వెంటిలేటరుపై వైద్యులు చికిత్సలు అందిస్తూ వచ్చారు. గత మూడు రోజులుగా వెంటిలేటరుపై కొన ఊపిరితో కొనసాగిన అభిషేక్‌రెడ్డి శుక్రవారం తుదిశ్వాస వదలారని వైద్యులు ధ్రువీకరించినట్లు వైఎస్ కుటుంబ సభ్యులు తెలిపారు. అభిమానుల సందర్శనార్థం అభిషేక్‌రెడ్డి పార్థివ దేహాన్ని శనివారం పులివెందుల పట్టణంలోని ఆయన స్వగృహం నుండు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. తదుపరి అదే రోజు మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో పట్టణంలోని లయోలా కళాశాలకు వెళ్లే మార్గంలోని వైఎస్సార్ సమాధులతోట వద్ద అభిషేక్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వైఎస్ కుటుంబ సభ్యులు వెల్లడించారు.

## ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర-చెన్నూరు : శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని వైష్ణవ ఆలయాలలో ముక్కో టి ఏకాదశి వేడుకలు ఘనం గా నిర్వహించారు. స్థానిక ప్రసన్న వెంకటేశ్వర స్వామి( కోట్ల స్వామి) సరస్వతి నగర్ లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ లలో తెల్లవారుజాము నుండి స్వామివారికి ప్రత్యేక పుష్పా లంకరణలతో పాటు అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. భక్తులకు సర్వదర్శనం గారించారు. ఏడుగం టల నుండి రామదాసు భక్త బృందంచే భజన కార్యక్ర మం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తులతో పోటెత్తిన వైష్ణవ ఆలయాలు

విశాలాంధ్ర- గాలివీడు: మండల వ్యాప్తంగా వైకుంఠ ఏకా దశి సంద ర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడా యి.మండల కేంద్రంలోని బ్రాహ్మణవీధి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం,గేటు వద్ద కోదండ రామాలయం, బాలికోన్నత పాఠశాల వద్దగల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శించుకునేందుకు శుక్రవారం తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాల దగ్గర బారులు తీరారు. పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. పెద్దూరు బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఏర్పాట్లను దేవాదాయ శాఖ ఈఓ కొండారెడ్డి పర్యవేక్షించారు.

# సి.కె.దిన్నె తహసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ధర్నా

విశాలాంధ్ర-కడప రూరల్ : కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీ మేరకు అర్హులైన పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు,కడప నగర కార్యదర్శి యన్. వెంకట శివ డిమాండ్ చేశారు. రెండు సెంట్ల ఇంటి స్థలాల కోసం శుక్రవారం సిపిఐ రాష్ట్ర వ్యాప్త తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనలో భాగంగా చింతకొమ్మదిన్నె కార్యాలయం వద్ద కడప కార్పొరేషన్ పరిధిలోని 16, 17, 18 డివిజన్లకు సంబంధించిన ఇల్లు లేని పేదలు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు పగడపూల మల్లికార్జున, ఆవుల నారాయణ, యేసు రత్నం, చైతన్య, శేఖర్, చెన్నమ్మ,రాజు, శిరీష, గంగాభవాని, వరలక్ష్మి, ఆసియా, భారతి, కీర్తి, దేవి, లక్ష్మీదేవి సూర్యనారాయణ రెడ్డి,అరుణ, సావిత్రి, లత, సుకన్య, అమ్మన్ని, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

**జమ్మలమడుగులో:** జిల్లాలో అర్హులైన ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ పేదలకు సాగు భూమి, ఇంటి స్థలాలు సాధిం చేవరకు పోరాటం చేస్తామని సిపిఐ జమ్మలమడుగు కార్యదర్శి ప్రసాద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలోని డిప్యూటీ తాసిల్దార్ రూపేష్ కు సిపిఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటరమణ, మధు, శ్రీనివాసులు, గురుస్వామి, శంకర్,నాగరాజు, ఏఐవైఎఫ్ నాయకులు రాంప్రసాద్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటి స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - బద్వేలు : ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వద్దమాను వీర శేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా, శుక్రవారం ఉదయం 10 గంటలకు సిపిఐ బద్వేల్ మండల సమితి ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఇమ్మానుయేలు పట్టణ కార్యదర్శి బాలు జిల్లా సమితి సభ్యులు పడిగ వెంకటరమణ వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షులు నాగరాజు మహిళా సంఘం ఏరియా కార్యదర్శి విజయమ్మ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుబ్బారెడ్డి డిహెచ్ పిఎస్ మహిళా నాయకులు తిరుమల కృప నాయకులు పాల్గొన్నారు.

## వీఆర్ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని వీఆర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎస్ వెంకట రాముడు మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయానికి సంక్రాంతి పండుగ నిదర్శనం అన్నారు. రైతులు పాడిపంటలు పండించి ధాన్యాన్ని ఇంటికి తెచ్చుకునే వేల మూడు రోజులపాటు కుటుంబాలతో జరుపుకునేది సంక్రాంతి పండగ అన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన పావని, నవ్యశ్రీ, నందిని,సుమేధ, లోహిత,సంగీతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుమలేశు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలి

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లె : ప్రతి ఒక్కరూ భక్తి భావంను అలవర్చుకోవాలని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని మండలంలోని వేంపల్లి రోడ్డు మార్గంలో వెలసిన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయ అర్చకులు హరి స్వామి పూజారి కార్యక్రమాలు నిర్వహింప జేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## కిటకిటలాడిన సౌమ్యనాథ స్వామి ఆలయం

విశాలాంధ్ర-నందలూరు : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించు కున్నారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శనానికి తరలివచ్చారు. క్యూ లైన్లు భక్తులతో నిండిపోయి ఆలయం కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయం ఎదురుగా ఉన్న సౌమ్యనాథ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## శ్రీసాయి హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర- సిద్దవటం : స్థానిక శ్రీ సాయి హై స్కూల్ నందు ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పోలు వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ పిల్లలకు సంక్రాంతి పండుగ విశిష్టత ను తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిదాసు వేషాలు, ఆడపిల్లలు పట్టు బట్టలను ధరించి రంగవల్లికలను వేయడం జరిగినది. గంగిరెద్దులు, కోడిపందాల ఆటలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లలకు భోగి పండ్ల ను తలపై పోసి అందరికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేయడం జరిగినది. పాఠశాల ప్రిన్సిపల్ రేవతిదేవి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పంచాయతీ కార్యదర్శుల సమావేశం

విశాలాంధ్ర-నందలూరు : నందలూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం నందు పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ మీటింగ్ శుక్రవారం జరిగింది. ఇంటి పన్నులు, ఎస్‌డబ్ల్యుపీసీ నిర్వహణల మీద తగు సూచనలు సలహాలను అన్నమయ్య జిల్లా డీపీవో బాలకృష్ణారెడ్డి ఇచ్చారు. అనంతరం నందలూరు పంచాయతీ, పాటూరు పంచాయతీలలోని ఎస్‌డబ్ల్యుపీసీలను డీపీఓ సందర్శించారు. ఈ కార్యక్రమం నందు ఇంచార్జి ఈఓఆర్డి బి. శ్రీనివాసులు, నందలూరు సర్పంచ్ రాము తదితరులు పాల్గొన్నారు.


**పత్రికా ప్రకటన**

OFC Gangnandu Out Sourcing ప్రాతిపదికన Telecom Circle, APTRANSCo, Kadapa Zone నందు పనిచేయుటకు ITI, Any Traders, అర్హత కలిగిన క్రింద తెలిపిన వ్యక్తులు కావలెను. SC-1

సంప్రదించవలసిన చిరునామా

C. BOYAZU, Contractor

Cell : 83330 36050


# భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి వేడుకలు

## వేకువజామున నుంచే బారులు తీరిన భక్తులు- పటిష్టబందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి వేడుకలు జరిగాయి. ఉత్తరద్వార దర్శనం కోసం వేకుల జామున నుంచే భక్తులు బారులు తీరారు. తిరుమల ఘటన నేపథ్యంలో ఆయా ఆలయాల వద్ద పోలీస్ అధికారులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పులివెందుల పట్టణ పరిధిలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయం, శ్రీవారి ఆలయంలో భక్తులు పోటెత్తారు. వేకువ జామున నుంచే స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులు వైకుంఠ ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసా దాలు స్వీకరించారు. వైకుం ఠ ఏకాదశి హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైన పర్వదినం గా పరి గణించబడు తుంది. ఈ రోజును వైష్ణవులు ప్రత్యేకంగా పాటిస్తారు, ఎందుకంటే ఇది శ్రీవిష్ణుమూర్తి పూజకు అంకితమై ఉంటుంది. వైకుంఠ ఏకాదశి శుక్లపక్ష ఏకాదశి రోజున (మార్గశిర మాసంలో) జరుపుకుంటారు. ఈ రోజున విశేషంగా వైకుంఠ ద్వారాలు తెరుచుకుంటా యనేది విశ్వాసం, ఇది భక్తులకు మోక్షప్రాప్తికి ద్వారమని భావిస్తారు. భక్తుల కోర్కెలను సిద్ధింపజేయాలని ఆశిద్దాం.

## ప్రతి హామీని నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: బిటెక్ రవి

విశాలాంధ్ర-వేంపల్లి: ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని మాజీ ఎమెల్సీ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఇమాం నగర్ వీధిలో రూ 7.50 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును మాజీ ఎమెల్సీ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన ఎద్దుల కొండపై ఏర్పాటు చేసిన వైకుంఠ దర్శనంకు వెళ్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ని దర్శించుకున్నారు. అలాగే ఆలయం విశిష్టతపై ఆలయ అధికారులు, అర్చకులు తెలియ జేశారు. మాజీ ఎమ్మెల్సీ బిటెక్ ఎద్దుల కొండపైకి రావడంతో ఆలయ అధికారు లు శాలువతో ఘనంగా సత్కరిం చారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని పాలక మండలి మాజీ సభ్యుడు పివి రమణ, ఇఓ విశ్వనాథ్ రెడ్డిలు బిటెక్ ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్పీ జయరామిరెడ్డి, రజనీకాంత్ రెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

## 10వ తరగతి స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : ఎస్టియు పోరుమామిళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి స్టడీ మెటీరియల్లు మండల విద్యాశాఖ అధికారి శ్రీ బి బాలంకి రెడ్డి గారు మరియు మాజీ మండల విద్యాశాఖ అధికారి శ్రీపీ. రత్నస్వామి గారి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఎస్టియు ప్రాంతీయ కార్యాలయం పోరుమామిళ్లలో పోరుమామిళ్ల మండల ఎస్టియు అధ్యక్షులు శ్రీ కె. పుల్లయ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళావేదిక కో కన్వీనర్ ఎం. రామకృష్ణారెడ్డి రాష్ట్ర కౌన్సిలర్ చంద్రహాసరెడ్డి జిల్లా అసో అసోసియేట్ అధ్యక్షులు శ్రీయల్. పుల్లారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ .గురయ్య జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి.శ్రీని వాసులు మండల ప్రధాన ఆర్థిక కార్యదర్శులు ఏ జయరామి రెడ్డి బి భాష ,జిల్లా కమిటీ కన్వీనర్లు హుస్సేన్, ఎం.నారా యణరెడ్డి కో- కన్వీనర్ ఏ ఆనంద్ రీజనల్ కో కన్వీనర్ ఆర్ రమణయ్య సీనియర్ ఉపాధ్యాయులు జనార్దన్ శెట్టి బి చంద్రకుమార్ సుబ్బారెడ్డి ప్రకాష్ రావు జాఫర్ ,గుర య్యా ,జి రాజా, వెంకటసుబ్బయ్య, డివిఎల్. చంద్రశేఖర్ చెన్న య్య, అబ్దుల్ సలాం ,శేఖర్,మస్తాన్,జనార్దన్ బాబు పాల్గొన్నారు.

## ప్రతిపేదవానికి ఇళ్ళు స్థలం ఇవ్వాలి

విశాలాంధ్ర - పోరుమామిళ్ల రూరల్ : పోరుమామిళ్ల మండలంలోని ఇళ్ళు లేని ప్రతి పేదవానికి ఇంటి పట్టాలు, గ్రామీణ ప్రాంతాల్లో 0.03సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 0.02 సెంట్లతో పాటు బద్వేలు నియోజకవర్గంలోని ప్రతిపేద కుటుంబానికి 2 ఎకరాల ప్రభుత్వ బంజరు భూమిని ఇవ్వాల్సిందేనని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగుమస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్, పట్టణ సహాయ కార్యదర్శి కేశవులు డిమాండ్ చేశారు. పేదలకు ఇంటి స్థలాలు, భూములు ఇవ్వాలని అంబే ద్కర్ సర్కిల్ నందు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాల యం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా నిర్వహించి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్ర మంలో సీపీఐ ఏరియా కార్యవర్గ సభ్యులు జాకోబ్, సనమాల చెన్నయ్య, ప్రసాద్, ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు సఫా, పీరయ్య, సఫా, మండల నాయకులు వెంకటేశ్వర్లు, బెల్లం బాషా, రమేష్, రాబియమ్మ,, చంద్ర ప్రభాకర్, శ్రీనివాసులు, రవీంద్ర, బాలమ్మ, పాల్గొన్నారు.

# సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లె : ప్రజల సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరిం చాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో ఏర్పాటుచేసిన మండల సమావేశానికి ఎంపిడిఓ రెడ్డెయ్య, ఎమ్మార్వో శ్రీనివాసులు లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో మృతి చెందిన ఏవో గురుప్రసాద్, అటెండర్ సునీతలకు సంతాపం తెలిపి మౌనం పాటించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఫిబ్రవరి 28, మార్చి1, 2 న జరగబోవు గంగమ్మ జాతర సందర్భంగా జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం రోడ్లు గుంతల మయమై దర్శనమిస్తున్నాయని ఆర్అండ్‌బి, పంచాయతీ అధికారులు చొరవ చూపి వాటికి మరమ్మతులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సమరసింహ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపీటీసీ సభ్యులు దస్తగిరి, శంకర్ నాయుడు, ఉద యగిరి ఎల్లమ్మ, రామసుబ్బమ్మ, లక్ష్మీనారాయణ, మోటుపల్లిరాధ, సర్పంచులు వెంకటనారాయణ రెడ్డి, గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, రమణయ్య, నాగిరెడ్డి, జనార్దన్ రెడ్డి, మహేంద్ర బాబు, కేసవయ్య, చెంద్రా యుడు, పిఆర్ఏఈ సుబ్రహ్మణ్యం, ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ కిషోర్, ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి, ఎంఈఓలు చక్రేనాయక్, వ్యవసాయ అధికారి రమేష్ బాబు రావు, ఉద్యాన శాఖ అధికారి నాగమణి, వెలుగు ఏ.పి.వో. నిరంజన్, కోనంపేట, దేవలంపల్లె పి.హెచ్సి వైద్యులు సిద్దయ్య, సుమలత, ఇన్చార్జి ఏ.పి.వో వెంకటపతి, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర - అట్లూరు: 2024-25 సంవత్సరానికి సంబంధించి న బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు నేటి నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చునని అట్లూరు ఎంపీడీవో భాస్కర బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల తర్వాత లబ్ధిదారుల రుణాల మం జూరు చేసేందుకు టిడిపి ప్రభుత్వం ప్రణా ళిక రూపొందిం చిందని కొలుత బ్యాంకి లింకేజీ తో సబ్సిడీ రుణా లను వివిధ యూనిట్లు ఏర్పాటు చేసేం దుకు కార్పొరే షన్ అధికారులు చర్యలు చేపట్టారు. సబ్సిడీ రుణాల కోసం నేటి నుంచి 16వ తేదీ వరకు బీసీలు దరఖాస్తు చేసుకు నేందుకు అవకాశం కల్పించారు. మొత్తం 52 రకాల పై ఉపాధి యూనిట్లను స్థాపిం చినందుకు దరఖాస్తులను స్వీకరించర న్నారు. వీటితో పాటు 8 లక్షల యూనిట్ విలువతో జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేసేందుకు కూడా అవకాశం కల్పించారు.

## టీడీపీ సభ్యత్వంతో ఆర్థిక భరోసా

విశాలాంధ్ర -అట్లూరు: తెలుగుదేశం పార్టీ లో తెలుగుదేశం పార్టీకి శాశ్వత సభ్యత్వం పొందిన వ్యక్తి కుటుంబానికి ఆర్థికంగా బీమా సౌకర్యాలు ఉంటాయని అలాగే పార్టీ ఎల్లవేళలా బాగుండాలనే ఉద్దేశంతో అందుకు లక్ష రూపాయలు శాశ్వత సభ్యత్వం శుక్రవారం ఉదయం బద్వేల్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త యువ నాయకుడు రితీష్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బోవిళ్ల అమర్నాథ్ రెడ్డి, పొన్నవోలు సాంబశివారెడ్డిలసమక్షంలో సభ్యత్వ నమోదు చేసుకున్నట్లు అట్లూరు మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బోవిల్లనంద గోపాల్ రెడ్డి, అట్లూరు మండల పార్టీ అధ్యక్షుడు పాపుదిప్పు మల్లికార్జున్ రెడ్డి లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం అట్లూరు మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులు రెడ్డి, మండల ఎంపీపీ ఇంచార్జ్ పోతిరెడ్డి లు కూడా శుక్రవారం సాయంత్రం నియోజకవర్గ ఇన్చార్జ్ రితిష్ రెడ్డి సమక్షంలో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా రితీష్ రెడ్డి మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గం లో ఎక్కువ మంది కార్యకర్తలు సభ్యత నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ..పోరాటం

(మొదటి పేజీ తరువాయి) పోరాటంలో భాగంగా ఇదివరకే గ్రామ వార్డు సచివాలయాల వద్ద, రెండో దశ పదవ తేదీ శుక్రవారం తాసిల్దార్ కార్యాలయాల వద్ద అయినా ప్రభుత్వం స్పందించకపోతే కలెక్టర్ కార్యాల యాల దిగ్బంధనం తప్పదని వారు హెచ్చరించారు. ఆందోళన అనంతరం తాసిల్దార్ నారాయణ రెడ్డి కి సిపిఐ ప్రతినిధి బృందం పేదల వ్యక్తిగత అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎన్ వెంకటి శివ,జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎన్ విజయలక్ష్మి, సహాయ కార్యదర్శి బాదుల్లా, గంగా సురేష్, జి. మద్దిలేటి, జిల్లా సమితి సభ్యులు సావంత్ సుధాకర్, మునయ్య, శంకర్ నాయక్, టి మనోహర్ రెడ్డి, పి మల్లికార్జున, వి భాగ్యలక్ష్మి, దస్తగిరి, లింగన్న, బ్రహ్మం, నరసింహారావు, నాగరాజు, సుబ్బరాయుడు, ఏఐఎస్ఎఫ్ శివశంకర్, అరుణ్, ఆకిరానంద్, ఏఐవైఎఫ్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## .. ముక్కోటి ఏకాదశి వేడుకలు

(మొదటి పేజీ తరువాయి) వ శపులేటి సుబ్బ రాయుడు (చిన్న) భక్తుల సహకారంతో ఏర్పా టుచేసిన పుష్పాల అలంకర ణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది భక్తుల రద్దీ దృష్ట్యా తొక్కిసలాటలు జరగకుండా టీటీడీ వారు ప్రత్యేక క్యూ లైన్ లను ఏర్పాటు చేశారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ బాబు ఎస్ఐ శివప్రసాద్ ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో డిప్యూటీవో నటేష్ బాబుఆలయ ఇన్స్పెక్టర్ నవీన్ సిబ్బంది పాల్గొన్నారు ముక్కోటి ఏకాదశి హిందూమతంలో అత్యంత పవిత్రమైన రోజు ఈరోజు భక్తులు ఉపవాసం ఉండి విష్ణుమూర్తిని పూజించడం ద్వారా మోక్షం పొందుతారని భక్తులు నమ్ముతారు ముక్కోటి ఏకాదశి రోజున వైకుంఠ ద్వారం తెరుచుకుం టుందని భక్తుల నమ్మకం ఉత్తర ద్వారం గుండా స్వామివారి దర్శించుకుంటే స్వర్గలోక ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం ముక్కోటి అంటే మూడు కోట్ల దేవతలు ఈ రోజున విష్ణుమూర్తిని దర్శించు కుంటారని పురాణాలు చెబుతున్నాయి భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతోపశుపులేటి సుబ్బరాయుడు (చిన్న) పురావస్తు శాఖ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు జనార్దన్ రెడ్డి నిర్వహించారు చెరువు కట్ట మీద ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద దాతల సహకారంతో అన్నదానం భజన కార్యక్రమం నిర్వహించారు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర-సంబేపల్లె: ప్రజలు పరిసరాల ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మురుగు నీరు లేకుండా చేసుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య సూచిం చారు. మండలంలోని దుద్యాల పంచాయతీ పెద్ద జంగంపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండయ్య గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ దోమలు నివారించుకోవాలని మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవా లన్నారు. మురుగునీరు ఉంటే దోమల అభివృద్ధి చెందుతాయని తద్వారా జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. మురుగునీటి గుంతలను వీధుల్లో పారుతున్న నీటిని ఇళ్ల పరిసరాలను డాక్టర్ కొండయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబేపల్లె వైద్యాధికారి డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, జిల్లామలేరియా అధికారి వేణుగోపాల్, మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఎం ఎల్ హెచ్ పి శబ్రీన్, ఏఎన్ఎం దుర్గా, పాల్గొన్నారు.

## పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

విశాలాంధ్ర-సంబేపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతుల కోసం కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలిపారు శుక్రవారం మండలంలోని నాగిరెడ్డిగారిపల్లి గ్రామం పోతువాండ్లపల్లి, బండకాడపల్లిలో రైతుల గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకులం షెడ్ నిర్మాణం త్వరగా పూర్తిచేసి నందుకు రైతులను అభినం దించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని అన్ని సమస్యలను పరిష్కరిస్తా మని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, యువగలం సభ్యులు మండిపల్లి సిద్ధారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఏపీఎం సంజీవ రాజు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 12న నవోదయ మోడల్ నమూనా పరీక్ష

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ఎంపిక కొరకు జనవరి 18 వ తేదీన జరగబోయే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు, ఉపయోగపడేందు కు ఈనెల 12వ తేదీన స్థానిక భగత్ సింగ్ నగర్ కడప నందు శ్రీ దిన్నెపాటి బసిరెడ్డి వికాస్ కోచింగ్ సెంటర్ నందు, నమూనా పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ బసిరెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. నమూనా పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్ జిరాక్స్ ను తీసుకురావల సిందిగా తెలియజేశారు. మరిన్ని వివరాల కోసం 9390921596, 9493220186 పై నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## మిట్స్‌లో ఘనంగా సంక్రాంతి ముందస్తు సంబరాలు

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ నందు కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు ఘనంగా సంక్రాంతి ముందస్తు సంబరాలు చేసుకున్నారు. కళశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయభాస్కర్ చౌదరి, ఆర్ ఆర్ ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రెసిడెంట్ ద్వారకనాథ్ మరియు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ లు విద్యార్థులు చేసిన సంక్రాంతి వేడుకలను వీక్షించి అభినందనలు తెలియజేసారు. కలశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ ప్రజలు ఆనందోత్సవాలతో 3 రోజులపాటు జరుపుకునే తెలుగు పండుగ సంక్రాంతి అని, ఈ పండుగను 'పంటల' పండుగ అనీ, మార్పు తెచ్చే పండుగ అనీ కూడా అంటారు అని ఆయన అన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందినవారికి బహుమతులు అందజేసారు. కార్యక్రమం లో కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు భోగి మంటల చుట్టూ కోలాటాలు తదితర కార్యక్రమాలు జరిగాయి.

## ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర- కలికిరి: -స్థానిక మండల కేంద్రంలో శనివారం శివాలయం దగ్గర శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు, శ్రీధర్ పూజారి ఆధ్వర్యంలో వైకుంఠ ముక్కోటి ఏకాదశి వేడుకలను నిర్వహించారు.

## అర్హులైన పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలాన్ని ఇవ్వాలి:సిపిఐ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: అర్హులైన పేదలకు రెండు సెంట్లు స్థలాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలలో భాగంగా ప్రకటించారని ఆ మేరకు సర్వే జరిపి రెండు సెంట్లు ఇంటి స్థలాన్ని ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం నాడు పట్టనంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వాగ్దానాల పైన వాగ్దానాలు ఇచ్చి గద్దెనెక్కి ఆరు మాసాలు గడిచినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇళ్లు లేని పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చను సర్వేలే చేపట్టలేదని తక్షణం సర్వేలు నిర్వహించి అర్హులైన వారందరికి పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ ఏరియా సమితి సభ్యులు మచ్చ శ్రీను, వీరయ్య శెట్టి, వై.హరి, ఎల్లయ్య, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్, సహాయ కార్యదర్శి రాహుల్, నాగేంద్రలు మరియు వందలాది మంది పేదలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా సంక్రాంతి పండుగ సంబరాలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్:కడప నగరంలోని కందుల గ్రూప్ ఆఫ్ సంస్థ లలో. ముందస్తు సంక్రాంతి సంబ రాలను మనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కందుల విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ హాజరై మాట్లాడుతూ సంక్రాంతి తెలుగువారి ముఖ్యమైన పండగని పల్లె నుండి పట్టణం వరకు ప్రతి ఒక్కరు చేసుకునే పండుగ సంక్రాంతి అన్నారు. పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేసే విధంగా సంక్రాంతి సంబరాలు ఏర్పాటు చేయడం సంతోషదగ్గ విషయం అన్నారు. సంబరాలలో భాగంగా గంగిరెద్దుల కోలాహలం, హరిదాసుల సందడి, భోగి మంటలు., ఆటపాటలు భోగిళ్ల గొప్ప తనాన్ని విద్యార్థులకు తెలియచేశారు. విద్యార్థులంతా సంప్రదాయ దుస్తులతో అందరినీ అలరించారు. కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి మాట్లాడుతూ భోగి స్నానలను గురించి వివరించి ఈ సందర్భంగా సంక్రాంతి విశిష్టత గురించి వివరించి పిల్లలతో కలిసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ముగ్గుల పోటీ లతో పాటు వివిధ రకాల ఆటల పోటీలు, భోగిమంటలు వేసి, ఉపాధ్యాయుల మరియు విద్యార్థులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, డీన్ లు, విభాగాధిపతులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు

# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి:అంజాద్ భాషా

విశాలాంధ్ర-కడపకార్పొరేషన్:పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు తమ వంతు కర్తవ్యంగా భావించి వైసిపి పార్టీ కొరకు పని చేయాలని మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్. బి.అంజాద్ భాష పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలోని మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నివాస కార్యాలయం నందు నూతనంగా నియమితులైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ తోటా, కృష్ణ చాన్ భాష, జిల్లా సెక్రెటరీ టకోలి రమేష్ రెడ్డి, మునిశేఖర్ రెడ్డి లను సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసే వారికి ఎప్పటికీ తగిన గుర్తింపు ఉంటుందని మన నాయకులు జగన్మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరికి విలువ ఇచ్చి వారికి తగిన పదవులను ఇస్తారని పదవులు పొందిన వారు వారికి కేటాయించిన స్థాయిలో పార్టీ కొరకు కష్టపడి పనిచేసి మరింత గుర్తింపు పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ టిటిడి బోర్డు నెంబర్ యానాదయ్య, కార్పొరేటర్లు మొహమ్మద్ షఫీ, ఎస్.అజ్మతుల్లా ఖాన్, నాయకులు పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, రహీం, తదితరులు ఉన్నారు.

## ఘనంగా చలపల్లి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పెద్దమండ్యం : చల్లపల్లి నరసింహారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు నీతికి నిజాయితీకి మారుపేరుగా, మాటకు కట్టుబాట్లకు, ఒకే పార్టీ ఒకే విధానం, ఒకే న్యాయం నాబాట, నన్ను నమ్మిన నా కార్యకర్తలు, నా లీడర్లు, క్లాస్ పార్టీ సేవకులు అందరి కోసం పరితపించే వ్యక్తి చల్లపల్లి నరసింహారెడ్డి అని అన్నారు. తన కార్యకర్త కోసం, తనను నమ్మిన ప్రజల కోసం ప్రాణాలు ఇచ్చిన వ్యక్తి ఇస్తున్న వ్యక్తి మా చల్లపల్లి నరసింహారెడ అని కొనియాడారు. చల్లపల్లి నరసింహారెడ్డి గారి నాయకత్వం వర్ధిల్లాలి జై చల్లపల్లి జై జై చల్లపల్లి నరసింహారెడ్డి నాయకత్వం వర్ధిల్లాలిఅని తాలూకాలోని అన్నిమండలాల కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## ఫంక్షన్ కార్యక్రమంలో టిడిపి యువనేత కానాల

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీ డి అగ్రహారం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కానాల మల్లి కార్జునరెడ్డి మాధవిరెడ్డి వారి కుమార్తె ఫంక్షన్ కార్యక్రమంలో బెంగళూరు వారి నివాసంలో ఫంక్షన్ కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమానికి బ్రహ్మంగారిమఠం వివిధ ప్రాంతాల నుండి తెలుగుదేశం నాయకులు ఫంక్షన్ లో పాల్గొన్నారు మైదుకూరు శాసనసభ్యులు తమ్ముడు పుట్టా ప్రభాకర్ యాదవ్ బ్రహ్మంగారిమఠం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, చెన్నుపల్లి సుబ్బారెడ్డి తోట్లపల్లి తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జి నియోజకవర్గ ఉపాధ్యక్షులు యత్తపు ఈశ్వర్ రెడ్డి, పెరుగు నాగేంద్ర, శివ యాదవ్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర- కడపకార్పొరేషన్: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అజ్మీర్ షరీఫ్ ఖ్వాజా గరీబ్ నవాజ్ దర్గాలో కడప మైనార్టీ నేత సుభాన్ బాషా, సుల్తాన్ బాబా,కార్పొరేటర్లు అలీ అక్బర్, షంషీర్ భాష, చాక్లెట్, రఫీక్, అలీ, సమీర్, ఏం భాష లు కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేద ప్రజలకు రొట్టెలను పంపిణీ చేసి, కొన్ని పుణ్య కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నేత సుభాన్ భాష మాట్లాడుతూ యావత్తు ప్రపంచంలోనే అజ్మీర్ షరీఫ్ ఖ్వాజా గరీబ్ బందే నవాజ్ గురించి తెలియని వారు ఎవరు ఉండరన్నారు. దర్గాను దర్శించుకుంటే అనుకున్న కోరికలు నెరవేడతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం నమ్మకంఅన్నారు. కడప ప్రజలు కులమతాలకు అతీతంగా, ఐకమత్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమంలో సుల్తాన్ బాబా, కార్పొరేటర్లు అలీ అక్బర్, షంషీర్ భాష, చాక్లెట్, రఫీక్, అలీ, సమీర్, ఏం భాష లు పాల్గొన్నారు.

## ఆర్ సియఫ్ ఎక్స్‌పర్ట్' సిమెంట్ శ్రేణిని ఆవిష్కరణ

విశాలాంధ్ర -మైలవరం : భారతదేశంలోని ప్రముఖ సిమెంట్ కంపెనీ దాల్మియా సిమెంట్ (భారత్) లిమిటెడ్ భారతదేశంలోని తమ కీలక మార్కెట్లలో 'రూఫ్, కాలమ్, ఫౌండేషన్ ఎక్స్పర్ట్' బ్రాండ్ పొజిషనింగ్ కింద నవీకరించిన సిమెంట్ పోర్ట్ ఫోలియోను ఆవిష్కరించినట్లు కడప ప్లాంట్ హెడ్ ముఖేష్ కుమార్ సిన్హా శుక్రవారం సాయంత్రం విలేఖరులకు తెలిపారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ సిన్హా మాట్లాడుతు ప్రధాన ఉత్పత్తులు, దాల్మియా రూఫ్ కాలమ్ ఎక్స్పర్ట్ మరియు దాల్మియా సిమెంట్ ఎక్స్పర్ట్, మెరుగైన ఫార్ములేషన్లుతో అత్యాధునిక నానో బాండింగ్ టెక్నాలజీ తో అభివృద్ధి చేయబడిందని అన్నారు .ఆధునిక నిర్మాణం యొక్క అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి రూపొందించబడిందని . రూఫ్ కాలమ్ ఎక్స్పర్ట్ శ్రేణి అధిక బలం, ఉన్నతమైన తుప్పు నిరోధకత మరియు కాల పరీక్షకు నిలబడటానికి నిర్మించిన దృఢమైన నిర్మాణాలను నిర్ధారిస్తుందని పేర్కొన్నారు . గృహనిర్మాణదారులు ఇప్పుడు వేగవంతమైన సెట్టింగ్ సమయాలు, అత్యుత్తమ పని సామర్థ్యం మరియు పర్యావరణ సవాళ్లకు మెరుగైన నిరోధకత వంటి అధునాతన లక్షణాలను కోరుకుంటున్నారని తెలిపారు. దక్షిణ భారతదేశంలో, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మరియు తమిళనాడు రాష్ట్రాలలో 17421కంటే ఎక్కువ ఛానల్ భాగస్వాములతో బలమైన పట్టును కలిగి ఉండటంతో స్థిరమైన జీవనోపాధి, నైపుణ్య అభివృద్ధి మరియు పర్యావరణ నిర్వహణపై దృష్టి సారించే దాని సమగ్ర కమ్యూనిటీ కార్యక్రమాలు, భారతదేశ నిర్మాణ రంగంలో విశ్వసనీయ భాగస్వామిగా దాని ఖ్యాతిని మరింతగా పదిలం చేస్తున్నామని తెలిపారు.

## వేపమాను కు పాలు కారుతున్న వింత ఘటన

విశాలాంధ్ర-పెద్దమండ్యం :మండలంలోని నత్తి ఓబన్నగారి పల్లి పంచాయతీలో ఓ రైతు పొలము దగ్గర వేప మానుకు పాలు కారుతున్న విషయం ఆ రైతు గమనించి ప్రజలకు తెలిపారు. విషయము తెలుసుకున్న ప్రజలు ముక్కోటి ఏకాదశి కావడంతో ప్రజలు మంచి రోజు విచిత్ర సంఘటనను ప్రజలు తండోపతండాలు ప్రజలు పూజలు నిర్వహిస్తూ టెంకాయలు కొట్టి బ్రహ్మంగారి జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నారు.

## కన్నుల విందుగా వైకుంఠ ఏకాదశి

**విశాలాంధ్ర-పీలేరు:-** వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని పీలేరు పట్టణం కోటపల్లి లో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి పద్మావతి ఆండాళ్ సమేత విగ్రహ మూర్తులకు ఉదయాత్వమే ఆలయ పూజారులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పుష్పాలంకరణ చేశారు అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో కమిటీ నిర్వాహకులచే కనుల విందుగా పుష్పాలంకరణ భక్తులకు సౌకర్యార్థంగా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు గుడి వద్ద ఎటువంటి అవాంతర్నియా సంఘటన జరగకుండా కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా అక్కడ ఏర్పాటు పనులను చూసుకున్నారు ఈ సందర్భంగా ఉదయం నుండి సాయంకాలం వరకు అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు అక్కడికి విచ్చేసిన భక్తాదులకు ఆలయ నిర్వహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**విశాలాంధ్ర-ప్రొద్దుటూరు:** పట్టణంలోని స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమం నందు గల శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ముందస్థు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. సాంప్రదాయ బద్ధంగా ముందుగా భోగి మంటను వెలిగించి సంక్రాంతి సంబరాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ముందు రోజుల్లో జరుపుకునే విధంగా భోగి మంటలు, రంగోలీలు, బొంగరాలాట, గోలిగుండ్లాట, ఉయ్యాల, నాట్లు నాటడం వంటి కార్యక్రమాన్ని అన్ని కూడ ఈ సంబరాల్లో ఏర్పాటుచేశారు. ప్రతి సంవత్సరం వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఈ సంబరాలను నిర్వహిస్తుందని కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక అధ్యాపకేతర బృందం మరియు విధ్యార్ధిని, విధ్యార్ధులు అందరూ పాల్గొని సంక్రాంతి సంబరాలను వారి వారి నృత్య ప్రదర్శనతో అలరించారు.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

### శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

**విశాలాంధ్ర-మదనపల్లె :** మదనపల్లి పట్టణంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. శుక్రవారం సూర్యోదయ పూర్వం నుంచే ఉత్తర ద్వారం ద్వారా, స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆధ్యాత్మిక వాతావరణంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఆలయంలో ఘనంగా జరిగాయి. ఆలయ కార్యనిర్వహణ అధికారి పర్యవేక్షణలో భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీవారి దర్శనాన్ని కల్పించారు. ఆలయ ప్రధానార్చకులు గోవర్ధన్ బట్టర్ ఆలయంలో ప్రత్యేకంగా పూజలు, హెూమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఎస్సారైటీలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

**విశాలాంధ్ర-ప్రొద్దుటూరు:** సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నాడు కళాశాల మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్, హెచ్ఓడిలు, స్టాఫ్ మరియు విధ్యార్ధిని, విధ్యార్ధులచే ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బాల మద్దిలేటి హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల వాతావరణం చూస్తూ ఉంటే మా ఊరిలో సంక్రాంతి పండుగ జరుపుకున్నట్లు ఉందని అన్నారు. చైర్మెన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పాల్గొన్న ప్రతి ఒక్కరు సాంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా సంబరాలు జరుపుకోవడము మంచి సంప్రదాయము అన్నారు. కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విధ్యార్థులు ఒక్కటిగా శ్రమించి గ్రామీణ వాతావరణమును సృష్టించి సంక్రాంతి పండుగ ముందే వచ్చిందన్నా స్పృహ కల్పించారని కొనిఆడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విధ్యార్థులలో ఐకమత్యము వారిలో ఉన్న టాలెంట్ బహిర్గతము చేసుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ. వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయని అన్నారు. అ వెంకటేశ్వర రెడ్డి, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విధ్యార్ధిని, విధ్యార్ధులు పాల్గొన్నారు.

## తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించాలి:ఏఐఎస్ఎఫ్

**విశాలాంధ్ర-మదనపల్లె:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ మదనపల్లి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో స్థానిక మదనపల్లి లోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలని, రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 3850 కోట్ల బకాయిల ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేయాలని, బిటి కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మాధవ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రావడానికి విద్యార్థులకు వారి యొక్క తల్లిదండ్రులకు తల్లికి వందనం పథకాన్ని షరతుల్లేకుండా ప్రతి ఒక్క విద్యార్థికి అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చి 100 రోజుల పాలన సంబరాలు పూర్తి చేసుకుంటూ విద్యార్థులను చీకటి రోజుల్లోకి నెట్టి వేసే విధంగా పేద విద్యార్థులందరికీ ఈ విద్యా సంవత్సరం తల్లికి వందనం అమలు చేయలేమని తీసుకున్నటువంటి నిర్ణయం సరైనది కాదని దుయ్యబట్టారు వెంటనే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రియంబర్స్మెంట్ 3850 కోట్ల బకాయిలను ఎందుకు విడుదల చేయలేదని వారు ప్రశ్నించారు. ఆ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కాబట్టి తక్షణమే విద్యార్థులకు పెనుబారంగా మారిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి, తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించి మదనపల్లిని జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వానికి అఖిల భారత విద్యార్థి సమాఖ్య డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ సహాయ కార్యదర్శి గంగారాని జిల్లా గర్ల్స్ కన్వీనర్ భవిత, జిల్లా ఆఫీస్ బేరర్ సుఫియ, మదనపల్లి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కమలాకర్, వినయ్ నియోజక వర్గ కోశాధికారి సాయికిరణ్, పట్టణ అధ్యక్షులు శ్రీనాథ్, పట్టణ నాయకులు భాను, రెడ్డి నవదీప్, నవ్య, యశ్వంత్, బాలాజీ, ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### బాలికల జూనియర్ కళాశాలలో

## ముందస్తు సంక్రాంతి సంబరాలు

**విశాలాంధ్ర-మదనపల్లె :-** స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను కళాశాల ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సేగు రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలు నేటి యువత అలవర్చుకోవాలని భావితరాలకు అందించాల్సిన బాధ్యత విద్యార్థులపైన ఉందన్నారు. సంక్రాంతి సకల ప్రజలకు శుభాలు చేకూరుస్తుందన్నారు. విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకుని అన్నిరంగాలలో దూసుకు పోతున్నారని వివరించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని విద్యార్థులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది చిట్లా కుప్పను ఏర్పాటు చేసి భోగి మంట వేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అద్యాపకులు పాల్గొన్నారు.

### ఎస్సీ ఎస్టీ మానరిటింగ్ సమావేశాన్ని

## బహిష్కరించిన సిపిఐ, సిపిఎం

**విశాలాంధ్ర- పీలేరు :-** పీలేరు పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో మండల తాసిల్దార్ అధ్యక్షతన ఎస్సీ ఎస్టీ సమావేశం మనారిటింగ్ సమావేశం జరిగింది ఈ సమావేశానికి మండలంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన కొంతమంది అధికారులు రాకపోవడంతో సిపిఐ సిపిఎం పార్టీ నాయకులు బహిష్కరించారు ఈ సందర్భంగా సిపిఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టిఎల్ వెంకటేష్, సిపిఎం, జిల్లా నాయకులు వెంకటరామయ్య మాట్లాడుతూ పీలేరు మండలంలో ఎస్సీ ఎస్టీ మాన రిటింగ్ సమావేశం జరుగుతుందని అందరూ సకాలంలో రావాలని తాసిల్దార్ అన్ని డిపార్ట్మెంట్ లకు లెటర్లు పంపించిన కొంతమంది ఉద్దేశపూర్వకంగా సాంఘిక సంక్షేమ శాఖ, గృహ నిర్మాణ శాఖ, బ్యాంకింగ్ అధికారులు రాకపోవడం చాలా బాధాకరమన్నారు.

### రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ పర్యటనను

## విజయవంతం చేద్దాం

### ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి

**విశాలాంధ్ర- పీలేరు:** పీలేరు నియోజకవర్గ కేంద్రంలో ఎంఆర్పిఎస్ , ఎం ఎస్ పి మరియు అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం ఎం ఎస్ పి పీలేరు నియోజకవర్గ ఇంచార్జ్ గండికోట వెంకటేష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిధులు గహాజరైన ఎమ్మార్పి యస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ విశిష్ఠ అతిధులు ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము చిన్న మాదిగ, ఎం ఆర్ పి ఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎర్రబల్లి రవీంద్ర మాదిగ లు సంయుక్తంగా మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ లక్ష్య సాధనకై అభినవ అంబేద్కర్ మహాజన నేత మందకృష్ణ మాదిగ గత 30సంవత్సరాలు గా అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ చట్టభద్దతకై వన్ మాన్ కమిషన్ గౌరవ రాజీవ్ రంజన్ మిశ్రా రిటైర్డ్‌ని చైర్మన్ గా నియమించి వన్ మాన్ కమిషన్ చైర్మన్ రాష్ట్ర వ్యాప్త పర్యటన లోభాగంగా ఈ నెల 21 మంగళవారం నాడు ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా పీలేరు నియోజకవర్గం లోని మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు, సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని బలపరచ్చే ప్రజా స్వామిక వాదులో అందరూ వేలాది మంది చిత్తూరు జిల్లా కేంద్రానికి చేరుకొని కమీషన్‌కు వినతి పత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్‌పిఎస్ పీలేరు నియోజకవర్గం కో ఇన్చార్జ్ అమరాల వెంకటరమణ, ఎం ఆర్ పి ఎస్ పీలేరు మండలం ఇన్చార్జి చరణ్ కుమార్, వి హెచ్ పి ఎస్ పీలేరు నియోజకవర్గ నాయకులు రామ మోహన్ రెడ్డి, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి సీనియర్ నాయకులు ముస్తూరు విశ్వనాథ, నాగేశ్వరరావు, మహేష్, రమణ, శ్రీరాములు, నాగరాజ, అర్జునయ్య, ఎంఆర్‌పిఎస్ యువ నాయకులు రాము, గండికోట రెడ్డి కుమార్, రమణ, కుమార్ మహిళలు రెడ్డమ్మ , మాధవి, సుగుణ,నాగరజమ్మ పాల్గొన్నారు.

## బాధ్యతారాహిత్యం వల్లనే భక్తుల మృతి:రాచమల్లు

**విశాలాంధ్ర-ప్రొద్దుటూరు:** వైకుంఠ ఏకాదశి సంధర్భంగా దైవదర్శణం కోసం వచ్చిన భక్తులకు ఈ ప్రభుత్వం రక్షణ కల్పించలేక పోవడం వల్లనే 6మంది మృతి చెందగా 45మందికి గాయాలు అయ్యాయని, ఈ ఘటన ప్రభుత్వం బాధ్యతారాహిత్యం వల్లనే జరిగిందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాచమల్లు మాట్లాడారు.

# ఎల్ఐసి పెన్షనర్ల సమస్యలపై ధర్నా

- పెన్షన్ అప్డేషన్ ఇవ్వాలి - పెండింగ్ సమస్యల పరిష్కారం చేయాలి
- ఎల్ఐసి పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధీకర్

విశాలాంధ్ర-కడప : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఆర్బిఐ సిబ్బందికి అమలు చేస్తున్నట్లు ఎల్ఐసి పెన్షనర్లకు కూడా సిబ్బందికి వేతన సవరణ జరిగినప్పుడల్లా జరిగినప్పుడల్లా, పెన్షన్ సవరణ చేసి పెన్షన్ అప్డేషన్ ఇవ్వాలని పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధీకర్ అన్నారు. స్థానిక ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం ఎదుట అధ్యక్షులు నీలపాల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జరిగిన 'దేశవ్యాప్త పిలుపులో భాగంగా జరిగిన ధర్నా' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దీనివల్ల పెరుగుతున్న ద్రవ్యాలను తాకిడిని తట్టుకోవడానికి వీలవుతుందని అన్నారు. దీనితోపాటు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న డిమాండ్ పరిష్కరించాలన్నారు. పెన్షనర్లకు క్యాష్ మెడికల్ బెనిఫిట్, ఏకరూప డి ఏ. చెల్లించాలన్నారు. 1986 ముందు రిటైర్ అయిన పెన్షనర్లకు ఎక్స్‌గ్రేషియా పెంచాలన్నారు. మెడికల్ పథకంలో మెరుగు దల పై నిర్ణయం తీసుకోవాలన్నారు. మాజీ సైనికులకు, ఇంజనీర్లకు పెన్షన్ పథకం కోరుకునే అవకాశం ఇవ్వాల న్నారు. వివక్ష లేకుండా లేకుండా రిటైరైన పెన్షనర్లందరికీ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ నాయకులు శంకర్రావు, చంద్రశేఖర్ రెడ్డి, అజయ్, కస్తూరి, పకీరయ్య, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండ ఎర్ర జెండానే..

విశాలాంధ్ర-కడప రూరల్ : దేశ రాజకీయాల లో కమ్యూనిస్టు ఉద్యమం నిర్వహించిన పాత్ర గర్వించదగినదని, అశేష త్యాగాలతో పునీతనమైన సిపిఐ వందేళ్ళ ఉత్సవాలను వాడ వాడల నిర్వహించుకుంటున్నామని సిపిఐ నగర్ కార్యదర్శి యన్.వెంకట శివ పేర్కొన్నారు. కడప నగర ఈస్ట్ జోన్ పరిధిలో గల 2, 3వ డివిజన్ల పరిధిలోని ఎద్దుల ఈశ్వర్ రెడ్డినగర్, తిలక్‌నగర్ శాఖలో శుక్రవారం సిపిఐ 100 సంవ త్సరాల వార్షికోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వెంకటశివ సిపిఐ జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించి 2024 డిసెంబర్ 26 నాటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని శత జయంతి ఉత్సవాలు నిర్వహించుకుంటున్నమన్నారు. సిపిఐ ఎర్ర జెండా నీడన కడపలో వేలాది మంది పేదలు భూపోరాటం నిర్వహించి నిర్మించుకున్నారని, ఎద్దుల ఈశ్వర్ రెడ్డి నగర్ , తిలక్ నగర్‌ల పేదల కాలనీల నిర్మాణంలోనూ సిపిఐ పోరాటం ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఈస్ట్ జోన్ కార్యదర్శి బి. శంకర్ నాయక్, సీనియర్ నాయకులు బ్రహ్మం, మధు, నరసమ్మ, మునెమ్మ, శేఖర్, చైతన్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలతో మున్సిపల్ యంత్రాంగం నిరసన

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్రంలోని కల్యాణదుర్గం, నంద్యాల మున్సిపల్ కమీషనర్లపై రాజకీయ కారణాలతో దాడులు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట పురపాలిక ఉద్యోగులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహిస్తున్న అధికారు లపై దాడులు చేయడాన్ని వీరు ఖండించారు. రాజకీయ నాయకులు ఉద్యోగులపై ఒత్తిళ్లు తేవడం, దాడులు చేయడం తగదని వీరు నినదించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బాధిత ఉద్యోగులకు వీరు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కమీషనర్ శేషఫణి, మేనేజర్ పుల్లయ్య, ఏఈ సురేష్‌బాబుతో పాటు చాంద్‌బాషా, వినోద్‌రెడ్డి, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## చూడచక్కని రహదారులు వస్తున్నాయ్

### టిడిపి ఇన్ ఛార్జి బిటెక్ రవి

విశాలాంధ్ర- పులివెందుల: ఎన్ డియే ప్రభుత్వ పాలనలో చూడచక్కని రహదారులు వస్తున్నాయని పులివెందుల అసెంబ్లీ టిడిపి ఇన్ ఛార్జి బిటెక్ రవి పేర్కొన్నారు. పులివెందుల మండల పరిధిలోని ఈ కొత్తపల్లి గ్రామంలో నూతన సిమెంట్ రహదారులకు శుక్రవారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలతో పాటు రోడ్ల నిర్మాణాలకు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. సంక్రాతి నాటికీ గుంతలు లేని రోడ్లు చూస్తారన్నారు. గత ఐదేళ్ల పాలనలో రహదారుల గురించి పట్టించుకోకపోవడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారన్నారు. ఇక ఆ పరిస్థితి ఉండదన్నారు. మున్ముందు రాష్ట్రవ్యాప్తంగా సునాయాస ప్రయాణం కోసం చక్కటి రహదారులను ఏర్పాటు చేస్తారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి :ఏఐటియుసి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడప కేంద్రం లోనే కొనసాగించాలి లేని యెడల పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపడతామని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు తుమ్మల రాధాకృష్ణ సంబంధిత బ్యాంకు అధికారులను హెచ్చరించారు. శుక్రవారం పాత్రికేయులతో మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాలు, సన్న, చిన్నకారు రైతులు, వ్యాపారులు, స్వయం సహాయక మహిళా సంఘాలు, చేతివృత్తుల వారు, ఎదుగుతున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇలా అనేక రకాల వారికి రుణాలు ఇచ్చి అందుకుంటున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు తరలిపోతే తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు,మేధావులు, ప్రజాస్వామ్య వాదులు పార్టీలకు అతీతంగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అమరావతి కి తరలిపోకుండా ఎదుర్కోందామని విజ్ఞప్తి చేశారు. తరలిపోయిన తరువాత ఏమీ చేయలేమన్నారు.

## ఘనంగా ముక్కోటి ఏకాదశి

విశాలాంధ్ర- సుండుపల్లి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకములు నిర్వహించారు . మండల పరిధిలోని ఆరోగ్య పురం ఎన్ జేఆర్ కాలనీలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనాన్ని కల్పించారు. డాక్టర్ నాయని జనార్ధన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు అభిషేకములు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్రు నాయక్ వచ్చిన భక్తులకు అర్చనలు చేయించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే తిరుమల లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల నుండి కాక మండల కేంద్రం నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెదినేని కాలువ మాజీ సర్పంచ్ రాజగోపాల్ పలువురు భక్తులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని శివాలయంలో విరూపాక్ష స్వామికి నరసింహా స్వామికి ఆలయ అర్చకులు హరికృష్ణ స్వామి అభిషేకంలో నిర్వహించారు.

## బాబు, పవన్‌లు మోదీని పొగడటం హాస్యాస్పదం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ప్రధాని మోదీని పొగడటం హాస్యాస్పదంగా ఉందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ధ్వజమెత్తారు. పులివెందుల పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంత కాగా,ఇచ్చింది గోరంత మాత్రమేనన్నారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేక హోదా కు పంగనామం పెట్టిందన్నారు. రాయలసీమకు,ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఇవ్వలేదన్నారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయలేదని, దుగరాజ పట్నం ఓడరేవు ఊసే లేదని, రాజధానికి గ్రాంట్ రూపంలో నిధులు ఇవ్వలేదని దుయ్యబట్టారు. జాతీయ ప్రాజెక్టు పోలవరం ప్రశ్నార్థక మైందన్నారు. విభజన చట్టంలోని 9,10 షెడ్యూల్ లోని సంస్థల విభజన జరగ లేదని, విశాఖ, విజయవాడ మెట్రో రైల్ల ప్రస్తావన లేదన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ పరం చేయాలని ప్రయత్నం చేస్తోందని వెల్లడించారు. ఈ విధంగా మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తూ వుంటే చంద్ర బాబు ,పవన్ కళ్యాణ్ పోటీపడి విశాఖ సభలో మోదీని పొగడడం సిగ్గుచేటని తులసిరెడ్డి విరుచుకు పడ్డారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తిరుపాల్‌రెడ్డి, నాగరాజు, అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, చిన్నకొట్ల నాగ రాజు, జితేంద్ర పాల్గొన్నారు.

**శ్రీరంగని సన్నిధిలో తులసిరెడ్డి :** వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని పులివెందుల పట్టణంలో వెలసిన శ్రీరంగనాథస్వామి వారిని మాజీ రాజ్యసభ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. తులసి రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు తిరుపాల్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, ఉత్తన్న, చిన్నకొట్ల నాగరాజు, వినయ్, జితేంద్ర, పండు, శ్యామలమ్మ, మాధురీరెడ్డి,అంజిని తదితరులు ఉత్తర ద్వారం ద్వారా శ్రీ రంగనాథుని దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ సుధీకర్ రెడ్డి దినేష్ గుప్తా తదితరులు ఆలయ మర్యాదలతో తులసి రెడ్డిని సత్కరించారు.

## అరుదైన ఘనత సాధించిన గవర్నమెంట్ మెడికల్ కాలేజీ

విశాలాంధ్ర-కడప : గవర్నమెంట్ మెడికల్ కాలేజీ కడప మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది, ఇన్‌స్టిట్యూషనల్ ఎథికల్ కమిటీ, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ కడప, దేశవ్యాప్తంగా సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ న్యూ ఢిల్లీ నుంచి గుర్తింపు పత్రాన్ని పొందింది. దీనివల్ల అకాడమిక్ రీసెర్చ్ ఆక్టివిటీస్, మరింతగా అభివృద్ధి చెందుతాయి. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.సురేఖ మాట్లాడుతూ, ఎథికల్ కమిటీ రిజిస్ట్రేషన్ అనేదివాలా కొద్ది కళాశాలలకు మాత్రమే లభించే అరుదైన గుర్తింపు అన్నారు, కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు ఈ ప్రయోజనాన్ని ఉపయోగించు కోవాల్సిందిగా సూచించారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా జనరల్ సర్జన్ డాక్టర్ గిరిధర్, మరియు కార్యదర్శిగా అనస్తీసియా విభాగాధిపతి డాక్టర్ సునీల్ వ్యవహరిస్తారన్నారు. ఈ కమిటీ ఏర్పాటుకు కృషిచేసిన అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి నిఅభినందించారు. కార్యక్రమంలో మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగ శ్రీలత పాల్గొన్నారు.

## అనంతపురం గంగమ్మ హుండీ ఆదాయం రూ.19లక్షలు

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లె : ఫిబ్రవరి 28, మార్చి1,2 వరకు మూడు రోజుల పాటు భక్త కోటి జన సందోహం నడుమ జరగబోవు శ్రీ శ్రీ అనంత పురం గంగమ్మ దేవత తిరునాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన వేలంపాటలో రూ.19లక్షల 47 వేలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు తెలియజేశారు. జాతర మూడు రోజులు టోల్ గేట్లు కొండూరు వెంకట్రామ రాజు రూ.5 లక్షల 70 వేలు , శ్రీరాములు జాతర మూడు రోజులు టెంకాయలు రూ.6 లక్షల 30 వేలు, విడిదినాల తలనీలాలు ఆనంద్ రూ.5 లక్ష 52వేలు, విడి దినముల యందు పూలదండలు రూ.1 లక్ష 95 వేలు మొత్తం రు.19 లక్షల 47 వేలు ఆదాయం వచ్చినట్లు ప్రత్యేక అధికారి తెలిపారు. జాతర మూడు రోజులు తలనీనాలు, విడి దినముల రోజున అంగళ్లు టోల్ గేట్లు, విడి దినముల రోజున టెంకాయలు పూల సామాగ్రి, విడుదినములును షామియానా సపరేట్ అంగళ్లు కలిపి నాలుగు వేలం పాటలు సరియైన వేలం పాట రానందువలన వాటికి ఈ నెల 17 న తర్వాత వేలం పాటను నిర్వహి స్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వేలంపాట దారులు పాల్గొన్నారు.